# ఒంటరి ప్రయాణం

✻

మద్దాళిబాల

అనసూయ ఒస్తున్నదంటే నా మనసు యెందుకో ఉత్సాహంతో ఉరకలు వేయసాగింది. ఒక ప్రక్క సంతోషం, మరొక ప్రక్క నిరుత్సాహం కలవర పెట్టాయి. ఇన్ని యేళ్ళ తర్వాత చూస్తాననే సంతోషం, యిప్పు డెలావుందో అని నిరుత్సాహం. అయినా యెంత కాలం గడిచింది! మేము కాలేజీలో చదువుకుంటున్న రోజులు. అనసూయ, నేనూ ఒకే క్లాసులో ఉండేవాళ్ళం. నాకు ఆమెను తెలుసు - బాగా తెలుసు అనవచ్చు. యెందు చేతంటే మే మిద్దరం ఒకే 'పేట' నుంచి కాలేజీకి వెడుతుండేవాళ్ళం. కాలేజీ మా యిళ్ళకు నాలుగు ఫర్లాంగుల్లో వుంటూండేది. నేను బయలుదేరిన అయిదారు నిమిషాలకు యెదురుగా గాజులు చప్పుడు వినిపించేది. తలయెత్తి చూస్తే అనసూయ కనిపించేది. క్లాసులో పేర్లు పిలిచినప్పుడు తెలుసు కున్నాను ఆపేరు యెవరిదో. కాని ఆమెతో మాట్లాడే అవకాశం కలగలేదు మొదట్లో. ఆవిడతో పరిచయం కలుగుతుందని కల్లో కూడా అనుకోలేదు.

ఒక రోజు కాలేజీకి వెడుతున్నాను. వెనుక నుంచి యెవరో నన్ను పిలిచి నట్లయింది. 'యెవరూ' అని పరధ్యానంగా వెనక్కు తిరిగాను. 'నేనే' అంది అనసూయ. పూవులోంచి వచ్చే పరిమళం లాగా మధురంగా వున్నాయి ఆమాటలు. అర్ధనిమీలితమైన కళ్ళతో, దీనంగా అడుగులో అడుగులు వేసుకుంటూ కనిపించింది. నమ్మలేని కళ్ళను సమాధాన పరచుకుంటూ, ఉప్పెనలా వచ్చే గగుర్పాటును అణచుకుంటూ 'మీరా' అన్నాను.

"మీ గడియారంలో టైము యెంతో చెప్పండి"

"యేం అంత తొందర?"

"తొందరే"

"యేమంత మించిపోలేదు. పది గంటలే. ఇంకా ఓ అరగంట వుందిగా. ఇంకొక అయిదు నిమిషాల్లో కాలేజీకి వెళ్ళక పోతామా..."

"మిమ్మల్ని ఆడిగినందుకు యేమీ అనుకోకండి. టైము అవుతోంది" అని త్వరగా నడిచింది. ఈ అమ్మాయికి యింత భయం యెందుకా అనుకున్నాను.

నేను కాలేజీకి. చేరేప్పటికి అరగంట ఆలస్య మయింది. క్లాసులోకి వెళ్ళుతుంటే అంతా గొల్లుమన్నారు. ఇదేమిటి చెప్మా అని పరీక్షగా గడియారాన్ని చూతునుగదా, అది రాత్రి పదిగంటకే ఆగిపోయి వుంటుందని నిర్ధారణకు రావలసి వచ్చింది. అప్పుడు అర్ధ మయింది ప్రొద్దున అనసూయ పడిన అలజడి. ఆమె సద్గుణ ఖని – దానికి సందేహంలేదు – అనుకున్నా అప్పుడు. కాని ఆమెకు ఆహ్వానం చెప్పటానికి ఈ రోజు స్టేషనుకు వెళుతున్నప్పుడు నా అభిప్రాయాలు – ఆమె మంచిని గురించి – యెంతవరకు సమంజసమో సరిగా నాకు తెలియదు. ఇంతకూ జరిగిందేమిటంటే ఆమె ఒక సాహసకార్యం చేసింది. నాకు తెలుసు రామానుజాన్ని. తలుచుకుంటే ప్రత్యక్ష మయినట్టు కన్పింస్తూంటాడు. పొట్టిగా లావుగా వుండేవాడు. కొంచెం మెరుస్తున్న నుదురు, దానిక్రింద కూచిగా వంగినముక్కు, యెప్పుడూ పదునుపెట్టి మెరుస్తూవుండే సానలాంటి గడ్డం, కొంగరెక్కలా తెల్లటి షర్టు మీద కొంచెం మాసికపట్టిన కోటు, యేదో ఒక రంగుది పాంటు – ఈయన ఆభరణాలు. ఇతనికీ, అనసూయకూ యెలా స్నేహం కుదిరిందో తెలియదు. తెలుసుకుందామని నాకు కుతూహలంగా వుండేది, అనసూయ రామానుజంతో అంతర్ధాన మయిందని తెలిసింతర్వాత, ఈ సంఘటన నన్ను యెన్నోవిధాల కలవరపెట్టింది. జీవితపు విలువలేమిటో నాకు అర్థంకాలేదు. ఏది మేలిమి బంగారమని నేను నమ్మానో అది కాకి బంగారమయి కూచుంది. నాలుగు దశాబ్దాలు నిండిన వీడికి యీ పౌఢ్యేకాలం యేమిటని కోపంవచ్చింది రామానుజం మీద. ఒక రింటికి చిచ్చుపెట్టి తమాషా చూడ్డం కొందరికి ఆనందం కాబోలు. మొహంమీద నవ్వు, లోపల విషం వుంటాయి కాబోలు కొందరు మనుషుల్లో. అయినా యెంత తెగించారు వీళ్ళు – యిలా అనుకుంటుండగానే హైదరాబాదుదాటి రైలుస్టేషనుకు ఓ ఫర్లాంగులో వుంది నేను యెక్కిన రిక్షా. గడియారం చూస్తే యింకా యిరవై నిమిషాలుంది రైలు రావటానికి. మెల్లగా రిక్షాదిగి స్టేషను ఆవరణలోకి ప్రవేశించాను. పిల్లల యేడ్పుల్తో, పెద్దవాళ్ళ అరుపులూ, ఊరడింపులతో సందడిగా వుంది అక్కడ. ప్లాటుఫారం మీద ఒక మూల కూర్చుని, వచ్చే బండికొరకు వేచి వుందాం – అనుకున్నాను. కాని అన్ని సీట్లలో మనుషులు కూచొని వున్నారు. నేరుగా వెయిటింగు రూముకేసి నడిచాను. "యేం బ్రదర్ ... ఇంత ఆలస్యంగా వచ్చారేమిటి ?" అన్న గొంతు వినిపించింది, ఒక మూలనుంచి. ఆ వైపుకు నా చూపులు ప్రసరించాయి. 'పెంగ్విను' నవల వెనుక అస్పష్టంగా

ముఖం కనిపించింది. ఎవరా అని దగ్గరకు వెళ్ళాను. "నేనే నోయి" అన్నాడు బ్రహ్మానందం, నవలను మడిచిపెడుతూ. అతను రావడం నాకు ధైర్యానిచ్చింది. సగంబరువు నా మీదినుంచి తీసిపెట్టి నట్లయింది. నేను "నువ్వు వచ్చావు. నాకు సంతోషం" అన్నాను.

"సంతోషంగా వుందంటావు నీ ముఖం చూస్తే మూడు రాత్రులు మారథాన్‌గా యేడ్చినట్టుంది ... అతిథి వొస్తున్నారనైనా అక్కర్లేదూ?అందులో లేడీగెస్టు? ఆ మజ్నూ పోజు కాస్త మార్చు బాబూ" అన్నాడు బ్రహ్మానందం. అలా మాట్లాడటం అతనికి వెన్నతో పెట్టినది.

"ఊరికే యేదో వాగక కార్యక్రమ మేంటో చెప్పు" అన్నాను.

"కోప మొచ్చిందా తండ్రీ ... అం యిదుగో నువ్వు, నేను, సంయుక్త కార్యదర్శులం ఉన్నాం కదా! విగతావారు యీ పాటికి సగందారిలో వుంటారు."

"మరి అసలు సంగతి మరిచావా ?"

"యేమిటీ ... ఆవిడకు వసతి గురించా...నీవు వుండనే వున్నావుగా, ఆమెకు తెలిసినవాళ్ళు యెవ్వరూ లేరు యీ ఊళ్ళో, నీవు తప్ప"

"పూలమాల సంగతి."

"అదా. అదుగో ఆ కిటికీలో. అంతా సిద్ధంగానే వున్నది. నీవు ధైర్యంగా వుండు విక్రమా "

"మన ఊరికి వచ్చిన వాళ్ళని గౌరవించడం మనల్ని గౌరవించుకోవడమే కదూ. అందుకని అలా అడిగాను."

క్షణంసేపు నేను ఆలోచనలో పడ్డాను. అనసూయ 'యెంతవరకు మేము యిస్తున్న గౌరవానికి పాత్రురాలో నాకు అర్థం కాలేదు. ఇప్పుడు ఓ ప్రొఫెసరు కావచ్చు. పేరు ప్రతిష్టలు సంపాదించుకొని ఉండవచ్చు చిన్నప్పుడు యెవ్వరికీ చెప్పకుండా రాత్రికి రాత్రి దేశంమీద పోయిన అమ్మాయేకదా ? అది యెలా మరువగలను ! ఈ విషయం బ్రహ్మానందంగారికి తెలిసి పోతుందేమో నని నాకు ఎందుకో భయంవేసింది. కొంచెం ఆలోచిస్తే ఆ భయానికి కారణం తేలిగ్గా తెలిసిపోయింది. అతను వట్టి మాటకారి. యేదైనా విషయం తెలిస్తే నలుగురి చెవుల్లో పడేసిందాకా నిద్రపోడు. నేనే సాహసించి, "అబ్బాయి; యిది పరిస్థితి. జాగ్రత్తగా మసులుకో, యీ సంగతి యెక్కడా పొక్కొద్దుసుమా" అని ముందే చెప్తే యెలా వుంటుందని ఆలోచించాను. అదేంబాగాలే దనిపించింది. అతని మీద నమ్మకముంచటానికి, కొరివితో తలగోక్కోటానికి అట్టే భేదం లేదేమో – అనుకున్నాను.

"హలో...యేమిటోయి ఆలోచన'' అని బ్రహ్మానందం అనేటప్పటికి గుండె కలుక్కుమంది.

"ఆలోచన లేదు...యేమీ లేదు"

"నాకు తెలీదను కున్నావా మన చీఫ్

గెస్టు సంగతి? యింతకూ ఈవిడ చీఫ్‌గెస్టు కాదు కదా...అయినా మనలో మన మాట...యేమంటావు?"

బ్రహ్మానందం అన్న ఈ మాటతో నాలోవుంటున్న కొస్త ధైర్యం కూడా మాయమైంది. యిక గత్యంతరము లేక అన్నాను, "అలా మాట్టాడ్డం నీకు న్యాయంకాదు. మన అందరం తప్పులు చేస్తూవుంటాం. నిజమేమిటో తెలీనంత వరకు మనము అనుకుంటున్న దంతా ఊహాగానమే..."

"అయితే అనసూయ విషయంలో జరిగిందంతా కలేనంటావా...''

"నేనలా అనను...అయితే నాకు ఒక్కటే తోస్తున్నది. జరిగిందేమిటో ఆవిడనే అడిగి కనుక్కుందాం. నువ్వు నాతోవుండు, అభ్యంతరము లేకపోతే..."

"నువ్వు అన్నది నిజమే బ్రదర్..."

నేను అందుకున్నాను; "యిప్పుడు ఈ విషయం లేవదీస్తే మనము సాయంత్రానికి యేర్పాటుచేసిన కార్య క్రమమంతా భగ్నమౌతుంది. అందరం అల్లరిపాలవుతాం — యేమంటావు బ్రహ్మానందం..."

''ఒప్పుకున్నాను తండ్రీ, భయపడకు...అదిగో సిగ్నల్ వాలింది... రైలుకూడా వస్తోంది." దూరంలో మేఘాలను చీల్చుకుంటూ ముందుకు ఠీవిగా నడుస్తోంది రైలుబండి. ఒక్కసారి ప్లాటుఫారం మీదవున్న వాళ్ళంతా— ఉత్సాహం, దుఃఖం, బాధ ఒకటేమిటీ యెన్నో అనుభూతులు పెనవేసుకుంటూండగా —లేచారు. నా చుట్టూ నా మిత్రులు, కాలేజీ విద్యార్థులు, ఆచార్య అనసూయగారికి స్వాగతం చెప్పటానికి నిల్చున్నారు. నాలో ఉత్సాహం యే కోశానా లేదు. దుఃఖం కలిగింది. వాళ్ళ మధ్యనుంచి నేను మాయమవుతే యెంత బాగుంటుం దనిపించింది. కాని అలా జరగలేదు. మా ముందు ఒక ఫస్టు క్లాస్ పెట్టె నిలిచింది దానిలో ఎవరూ లేరు, ఒక్క స్త్రీ తప్ప. యెవరో అనుకున్నాను. అనసూయే — ప్రపంచంలో వున్న దీనత్వానికంతా వారసురాలై నట్లుండే ఆ కళ్ళను నేనెలా మరువగలను! అయినా ఆవిడలో చాలా మార్పు వచ్చిందనే చెప్పాలి. మొహంలో పూర్వంఉన్న కాంతి కిరణం క్షీణించింది. కానీ పెదవుల మీద చిరునవ్వు, నాశిక మీద మెరిసే అలజడి, వంపు తిరిగిన నుదిటిమీద, స్ఫుటంగా కనిపించే దృఢ సంకల్పం పూర్వం కన్నా యినుమడించాయనటానికి సందేహం లేదు.

రెండు దశాబ్దాల తర్వాత ఆమెను చూస్తున్నాను. అందరిలాగా ఆమె జీవించివుంటే యిప్పటికి నలుగురైదుగురైనా పిల్లలతో, సుఖాల్నీ, కష్టాల్నీ పంచుకోడానికి భర్తతో కాలం వెళ్ళబుచ్చుతూ వుండేది కాబోలు. నాలాంటి

వాళ్ళు యెప్పుడైనా ఇలాగ కనిపిస్తే భర్తవైపు చూసి ముసి ముసి నవ్వులు నవ్వుతూ ''మా వారిని విశాఖపట్నానికి బదిలీ చేశారు. మా ఊరువచ్చి రెండు రోజులు వుండి పోకూడదూ...'' అని ఆహ్వానించో, లేక "మా అమ్మాయికి పది హేనోయేడు వస్తోంది. ఎక్కడైనా మంచి సంబంధంచూసి పెట్టరూ — మీకు యెప్పటికీ ఋణపడి వుంటాము,'' అని ప్రాధేయపడి వుండేది కాబోలు. ఇవన్నీ నా గొంతెమ్మ కోరికలు. అనసూయ నాతో అలా మాట్లాడితే వినే అవకాశం నాకు కలుగలేదు. ఇలా అనుకో సాగాను. ఈ లోపల బ్రహ్మానందం తది తరులు, ఆమెకు సుస్వాగతం చెప్పి ప్లాటుఫారం దింపి టాక్సీలో ఎక్కిం చారు. నేను అప్పటిదాకా నోరు విప్పక పోవటం చూచి "నేను మీకు జ్ఞాపక మున్నానా'' అంది అనసూయ.

"మిమ్మల్ని మరిచిపోవడం యెలా సాధ్యం అనసూయగారూ..."అని ఎత్తి పొడుస్తూ మాట్లాడాడు బ్రహ్మానందం నావైపు చూస్తూ.

"ఈ ఊరు వదలివెళ్ళిన మీకు అలాగే వుంటుంది. నేను మీకు జ్ఞాపకమున్నం దుకు కృతజ్ఞత చెప్పాలి.'' అన్నాను నేను టాక్సీలో ఎక్కుతూ.

ఆ రోజు సాయంత్రం క్లబ్బులో సభ దిగ్విజయంగా జరిగింది. ఆకాశంలో అక్కడక్కడా మబ్బులు ముసురు తున్నా సభ ప్రారంభించేసరికి ఆకాశం నిర్మలమై వాతావరణం హాయని పించింది. ప్రకృతిమాత చల్లని చూపులతో, నామిత్రులసహకారం కూడా ఆనాటి సభా విజయానికి తోడ్పడ్డాయి.

అనసూయ ఆ సాయంత్రం యిచ్చిన ఉపన్యాసం 'మణిపూస' అని చెప్పాలి. ఆవిడ సందేశమల్లా మనిషి బానిస అని మరిచిపోవాలి అని — అతనికి ఉండ కూడనిది 'భయం' అని. ఆవిడ మాట్లాడి నంతసేపూ బొమ్మలాగా కూచుని విన్నాను. కానీ, ఆమె చెప్పిన విషయం యెంతవరకు నిజం అని నాలో చాలా సేపు అంతర్యుద్ధం రేగింది అనసూయ యెంత వరకు తను చెప్పింది పాటించిందో నాకు అర్థంకాలేదు. ఆవిడకు నిజంగా ధైర్యం వుంటే యెందుకు కాలేజీలో చదువు కుంటున్నప్పుడు యిల్లు వదలి వెళ్ళి పోయింది? తను ఎవ్వరి బానిసను కానని నిర్ణయించటానికా?

తెల్లవారితే వెళ్ళిపోతుంది, అన సూయ. పొద్దున 8 గంటలకు బండి, అతను అప్పు డప్పుడు నా చెవికి అంద జేస్తున్న సందేశాలను బట్టి, బ్రహ్మానందా నికి అనసూయతో ప్రత్యేకంగా మాట్లా డాలని ఎన్నో సందేహాలను తీర్చుకో వాలని నాకు ప్రస్ఫుటంగా తెలిసింది. నిజం చెప్పాలంటే నాకూ కుతూహలం గానే వున్నది.

మేమిద్దరం భోజనమైన తరువాత అనసూయ మకాం చేసిన హోటలుకేసి దారి తీశాము. మేము గదిలోకి ప్రవేశించగానే, మమ్మల్ని కూర్చోమని సంజ్ఞచేసి, కాఫీ ఉత్తర్వు చేసింది.

"గది బాగా విశాలంగావుందే..." అన్నాడు బ్రహ్మానంద...

'అవును యిది యిద్దరుండాల్సిన గది సింగిల్ రూమ్‌గా మార్చారు" అని అనసూయ అంటూండగానే కాఫీ కప్పు తెచ్చాడు బంట్రోతు.

"ఇదేమి టండీ మేము యిద్దరం మీ కళ్ళముందు కూర్చునుంటే ఒక్క కప్పు మాత్రమే ఆర్డరిచ్చారు. మే మేం పాపం చేశామండీ అనసూయగారూ" అన్నాడు బ్రహ్మానందం.

'అది మీ పాపం కాదండీ ... నా పాపం, నేను కాఫీ ఆర్డరిచ్చాను. అతిథు లెవరూ నాకు వుండరను కుంటారు కాబోలు...ఒక కప్పే తెచ్చారు." అంది. వర్షించే మేఘంలా అయ్యాయి ఆవిడ కళ్ళు.

"యేం ఫర్వాలేదు. కాఫీకేం, యిప్పుడు తెప్పించుకోవచ్చుగా .." అని సమాధాన పరిచాను. ఆ మాటతో బ్రహ్మానందం నిజంగా బ్రహ్మానంద భరితుడయ్యాడు.

"అది అలా వుంచండి. ఇన్నాళ్ళు మీ రెక్కడున్నాటు, యేం చేస్తున్నాటు.." అని ఆలోచనా పూర్వకంగా కప్పుపైపుకు చూడ్డం మొదలెట్టాడు. నేను చెయ్యలేని ధైర్యాన్ని బ్రహ్మానందం చేసినందుకు ఒక విధంగా సంతోషపడ్డాను. కానీ అనసూయ యిచ్చిన సమాధానము నా చెవికి బల్లెంలా గుచ్చుకున్నది.

"ఏమండీ, మనిషి చచ్చిపోయినా కొన్నాళ్ళయ్యే ప్పటికి అంత పట్టించుకోరు కదా...నా గురించి ఎందుకండీ. మీకంతా ఆతురా ..నేను చచ్చిపోయానని నన్ను మరిచిపో కూడదా..."

అప్పుడు బ్రహ్మానందం అన్నమాటలు నా చెవుల్లో యింకా గింగురు మంటూనే వున్నాయి

"అనసూయగారూ. మనిషి చనిపోతే యే బాధా లేదు. కానీ అలా కాక ఒక వ్యక్తి జీవితం తెచ్చిపెట్టే సమస్యల్ని ధైర్యంగా యెదుర్కొని అనాయాసంగా పరిష్కరిస్తూ పురోగమిస్తున్నప్పుడు ఆ వ్యక్తి జీవితం ఆకర్షవంతం అవుతుంది..."

"నేను పురోగమించానో యేమిటో నేను ఎప్పుడూ ఆలోచించ లేదు. కాని యేదీ చెయ్యలేనప్పుడు మనిషికి మొండి ధైర్యం వొస్తుంది. యేదో ఒకటి చేసే స్తాము. నా విషయంలోనూ అదే జరిగింది. మీకు తెలిసే వుంటుందను కుంటాను, నేను పుట్టిన రెణ్ణెల్లకే మా అమ్మ పోయింది''

"మరి ఆవిడ యెవరూ..."అన్నాను. వాళ్ళింట్లో రుసరుస లాడుతూ వుండే

ఒక మధ్య-వయస్కు రాలిని మనస్సుకు తెచ్చుకుంటూ

"ఆవిడ మా పిన్ని. మా నాన్నకు నా పైన తల్లిలేని పిల్లని యెంతో మక్కువ వుండేది. కాని మా పిన్నితో పోట్లాటలు పెట్టుకొని సంసారాన్ని వీధిల్లోకి యీడవడం యిష్టం లేక నేను పడే బాధల్ని మౌనంగా చూస్తూ ఊరుకొనే వాడు. యెన్ని రోజులు నేను పస్తులు మాడేనో తలుచుకుంటే, అసలు యెల్లా బతికానా అనిపిస్తుంది. కానీ యేదో శక్తి నాకు యెప్పటికప్పుడు ధైర్యం చెప్తూండేది...

"దిక్కులేని వారికి దేముడే దిక్కు అంటూంటాం చూడండి. అది యెంత నిజం! నేను కాలేజీలో చేరాను. ఎలాగో పుస్తకాలు సరిగా వుండీ లేక నా చదువు సాగాల్సి వచ్చింది. మా పక్కింటిలోనే వుంటూ వొచ్చారు రామానుజంగారు. ఇంగ్లీషు చెప్తూ వుండేవారు. నేను పడుతున్న యిబ్బందులు వారి చెవికి వచ్చాయేమో ఒకరోజు నన్ను పిలిచి, ఆయన దగ్గిర ఇంగ్లీషు పుస్తకాలు రెండు సెట్లువున్నాయని, ఒకటి కావలిస్తే నన్ను తీసుకోమని చెప్పారు. ఆయన నాకు చేస్తున్న దానికి యెలా కృతజ్ఞత చెప్పాలో తెలియలేదు. కాని ఆ సాయంత్రం నా దగ్గిరవున్న పుస్తకాల్ని చూసి మా పిన్ని అన్నమాటలు నన్ను నిశ్చేష్టురాలిని చేశాయి. "ఇదిగో అంత ఇదైతే, ఆ పుస్తకా లిచ్చిన వాడితో లేచిపోరాదూ" అన్నది. నేను నిల్చున్న భూమి యెందుకు చీలి నేనందులోకి ఎందుకు పూడుకుపోలేదో తెలియ లేదు. నాకు పిచ్చిపట్టినట్టయింది. ఆ యింట్లో కాలం గడటం దుర్భర మనిపించింది. అనుకుంటూండగానే రామానుజంగారికి ఢిల్లీలో ఉద్యోగం దొరికింది. ఆయన రేపు వెళ్తారనగా నేను ధైర్యం చేసి ఆయన దగ్గిరకు వెళ్ళాను నాలో పేరుకున్న ఆవేదనంతా ఆయనతో చెప్పుకున్నాను నాకు కావల్సిన సానుభూతి దొరికింది "మీతో యెవరూ లేరుగా. నేను మీతో వస్తేతప్పా" అన్నాను. ఆయన లోపల యేమను కున్నారో యేమోనని భయపడ్డాను. కానీ ఆయన యేమీ చలించకుండా "సరే" నన్నారు. అలా జరిగింది నేను ఈ ఊరు వదిలి వెళ్ళడం" ఆమె మాటలు వింటూంటే నా కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"అయితే మీరు రామానుజాన్ని ప్రేమించారా" అనడిగాడు బ్రహ్మానందం.

"'ప్రేమ' యేమిటో ... వారు నన్ను ఆదరించారు అని మాత్రం చెప్పగలను. మీరు ఒక్క విషయం గమనించాలి వారికీ నాకూ మధ్య, వయస్సులో ముప్ఫయి ఒక్క సంవత్సరాలు తేడా. నేను వెళ్ళిన రోజున ఆయన వయస్సు నలభై యేడు. నా వయస్సు పదహారు. ప్రేమకు యే బంధం అడ్డురాకపోవచ్చు. వయోభేదం కూడా అంత పట్టింపు కాకపోవచ్చు..."

"మరయితే రామానుజం మిమ్మల్ని ప్రేమించారా..."

"అదే అసలు విషయం. ఆయన నన్ను పెళ్ళి చేసుకోమని కోరినా నేను ఒప్పుకుని వుండే దాన్ని. యే మాటా అనలేదు. అలా జరిగిపోతూ వచ్చింది. జ్ఞాపకం చేసుకుంటే ఒక్క సంవత్సరం కాలం ఆలా జరిగింది. నాకు తోడుగా ఒక వంటలక్క యెప్పుడూ అండగా వుంటూ వచ్చింది...యిలా కాలం గడుస్తుంటే మరొక వ్యక్తి మా జీవితంతో ప్రవేశించాడు..."

"ఎవరండీ" అన్నాను ఉబలాటం ఆపుకోలేక.

"అతని పేరు మాధవ్. రామానుజం గారివద్ద పాఠాలు చెప్పుకోడానికి వస్తూండే వాడు"

"మీరు కొంపదీసి అతన్ని ప్రేమించ లేదుగదా..." అన్నాడు. బ్రహ్మానందం.

"జరిగిన పొరబాటే అక్కడ జరిగింది."

"ఏం పొరబాటండీ" అన్నాడు బ్రహ్మానందం.

"అతను నా కళ్ళల్లో మెదుల్తూండే వాడు. పదేపదే అతన్ని చూడా లనిపించేది. ఇంతకు పూర్వం మీరు వయస్సు గురించి యేదో అన్నారు. ఎంత తెలివి తక్కువగా ప్రవర్తించానో తలుకుంటే సిగ్గుగా వుంటుంది. ఒకరోజు మాధవుకు కాఫీ, పలహారము ఇచ్చాను, అతన్ని చూస్తూ. అతను నా వైపు చూడకుండా నేను పెట్టిన దంతా సుష్టుగా తినేసి, కాఫీ గటగటా తాగేశాడు.

'ఈ రోజు మీ భర్తగారు లేరా' అన్నాడు. 'నా భర్త, నా భర్తెవరూ' అనడిగాను. అతనికి ఆశ్చర్యం వేసింది. 'అదే రామానుజం గారు' అన్నాడు. 'ఆ విషయం నీకెందుకూ' అన్నాను. దాని మీద అతనికి తొట్రుపాటు కలిగింది. 'పోనీ నాకు పెళ్ళికాకుంటే నీవు పెళ్ళి చేసుకుంటావా?' అని అడిగాను. 'అది సరే, మరి రామానుజంగారెవరూ?' అన్నాడు. 'ఆయన నా భర్త కాదు. ఆయన మీద నాకుండేదల్లా భక్తి మాత్రమే. అదలా వుంచి నిన్నొక విషయం అడగనా...' నేను వాక్యం పూర్తి చేయకుండానే మాధవు లేచి వెళ్ళి పోయాడు. అంతే. అదే ఆఖరుసారి అతన్ని నేను చూడటం. రామానుజం గారు సాయంత్రం వచ్చారు. నేను పరధ్యాన్నంగా వుండటము చూసి 'మాధవు ఈ రోజు వచ్చాడా' అని అడిగారు. జరిగిందంతా చెప్పాను. 'వాడు వట్టి గాజువంటి మనిషి...సరే ఏం చేస్తాం' అని మాత్రం అన్నారు. ప్రొద్దునే లేచి చూచాను. రామానుజంగారి పెట్టె, బెడ్డింగు మాయమయినాయి. టేబిల్ మీద ఒక జాబులో ఇలావుంది. "నిన్ను ఒంటరిదాన్ని చేసి వెడుతున్నందుకు బాధగా వుంది. కానీ

మనిద్దరి జీవితాలు రైలు పట్టాల్లాగా కలుసుకోలేవు. దూరం నుంచి రైలు పట్టాలు కలుసుకున్నట్లు కనిపిస్తాయి. కానీ అది ఒట్టి భ్రమమాత్రమే. నీకు, నీ కాళ్ళ మీద నిలబడే చదువూ, శక్తి వచ్చాయి. నీవు జీవితం ధైర్యంగా గడపగలవని ధైర్యం నాకు వుంది. నిన్ను ఆశీర్వదిస్తూ సెలవు తీసుకుంటున్నాను'. అలా నేను మాత్రమే ఇంట్లో మిగిలాను. ఆయన చెప్పిన ప్రతి మాటలోనూ ఎంతో సత్య ముంది."

బ్రహ్మానందం, నేను, నిర్జీవంగా, బదులు చెప్పలేక సిగ్గుతో తలవంచు కున్నాము. బ్రహ్మానందం కంట్లోనుంచి వచ్చే అశ్రువుల్ని ప్రక్కకు తిరిగి తుడుచుకున్నాడు. గద్గదమైన కంఠంతో "అనసూయగారూ ! మీరు నన్ను క్షమిం చాలి'' అన్నాడు.

"చాలా పొద్దుపోయింది. రేపు పొద్దున యెక్స్‌ప్రెస్‌కు వచ్చి లేపుతాము'' అని నేను, బ్రహ్మానందం మౌనంగా బయల్దే రాం. ప్రొద్దున రైలు పెట్టెలో అనసూయ గారిని యెక్కిస్తున్నప్పుడు, ఆ పెట్టెలో ఎవ్వరూ లేరు. రైలు బయలుదేరే టప్పుడు బ్రహ్మానందం అన్నాడు.

"ఈ పెట్టెలో యింకెవరూ ఉన్నట్టు లేరండీ"

"అదేమంత ఆశ్చర్యం కాదులెండి''

"అదేమిటీ...?''

"నేను వచ్చేటప్పుడు కూడా అలాగే జరిగింది. ఢిల్లీలో యెవరో ఒకాయన యెక్కారు పెట్టెలో. తోడు ఉన్నారుగదా అనుకున్నాను. కాని ఆయన ఆగ్రాలో దిగిపోయారు. ఇక్కడి దాకా నేను ఒంటరిగా ప్రయాణం చేశాను..."

"కాని వెళ్ళేటప్పుడూ ఒంటరి ప్రయాణమే..."

''అలాగే వుంది...కాని నేను బాగా అలవాటు పడ్డాను లెండి...యేం ఫర్వా లేదు'' అంటుండగానే రైలు హుషారుగా బయలు దేరింది. మేము కృతజ్ఞతా పూర్వ కంగా హస్తాలు ముకుళించాము. ★


వ్యర్థ వ్యయం మానండి
విలాసాలకు స్వస్తి చెప్పండి
జాతీయ రక్షణ కృషిని బలపర్చండి